# ముళ్ళ మోపు

మా ఇల్లు ఊరికి దూరంగానే ఉంది. కావాలనే అంత దూరంగా స్థిరపడ్డాం. రెండెకరాల తోట తెలిసిన ఆయన పట్టణం వెళ్ళిపోతూ మాకు చవకగానే అమ్మాడు. తోట మధ్యలో పెంకుటిల్లు ఉంది. ఆలనా పాలనా లేక ఇల్లూ, తోట కొద్దిగా పాడు బడ్డాయి.

ఆ తోటకు నీటి సౌకర్యం ఉండడం మంచిదయింది. నా భర్తకు ఓపిక ఎక్కువ. ఇద్దరం కలిసి తోటను అభివృద్ధి చేయడానికి ఆరునెలలు పైగానే పట్టింది. ఇంటిని కూడా ఒక రూపానికి తీసుకువచ్చి కరెంటు తెచ్చుకున్నాం. కష్టం ఎప్పుడూ మంచి

ఫలితాలనే ఇస్తుంది. డ్రిప్ పద్ధతి అవలంబించడం మొదలెట్టాక పని బాగా తగ్గింది. తోటలో అన్నిరకాల కూరగాయలు పెంచడం మొదలెట్టాం. పసులు చూసుకోడానికి పనివాళ్ళను పెట్టుకున్నాం. లోగడ పడిన కష్టం మెల్లగా తప్పుకుంటోంది. మునుపు ఇద్దరం కూలికి వెళ్తేగాని ఇల్లు నడిచేది కాదు. పని దొరకనప్పుడు పస్తులున్న రోజులున్నాయి.

కూరగాయలు సమృద్ధిగా పండడం మొదలెట్టాక మా తోటకు ఆనుకుని ఉన్న రెండు ఎకరాలను కొని అభివృద్ధి చేసి అరటితోట వేసాం. మా దశ మారటానికి రెండు సంవత్సరాలు పట్టింది. మా తోటలో పండినవి ఊరి మార్కెట్టుకు పంపించగలుగుతున్నాం. మొదట్లో నా భర్త ఎడ్లబండి మీద కూరగాయలను మార్కెట్టుకు తీసుకెళ్ళి మధ్యాహ్నం లోపలే అమ్మి ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఆయనకు తోడుగా మూడునాలుగుసార్లు నేనూ మార్కెట్టుకు వెళ్ళాను. ఆయనతో వెళ్ళిన ప్రతిసారీ మా కూరగాయలు మరింత త్వరగా అమ్ముడయ్యేవి.

ఏం కాలేదుగాని నేను ఆయన కూడా వెళ్ళడం ఆయనకు ఇష్టం ఉన్నట్టు అనిపించలేదు. వ్యక్తి మంచివాడే. నేనో ప్రత్యేకమైన దాన్నని అనుకుంటుంటాడు. వాళ్ళ వాళ్ళనందరినీ కాదని నన్ను చేసుకున్నాడు. నాకూ అక్క తప్ప ఎవరూ లేరు. మా ఆయన తరుపువాళ్ళు ఎవరూ మా ఇంటికి రారు. మా అక్క వాళ్ళు చాలా దూరంలో ఉన్నారు. మా పెళ్ళి అయ్యాక ఎక్కువసార్లేం కలుసుకోలేదు.

మా పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలు దాటాయి. ఆయన నామీద ఆరేడేళ్ళు పెద్ద. నన్ను ప్రేమగా చూసుకుంటాడు. ముద్దూ ముచ్చట్లు ఉన్నాయి. మా దురదృష్టం ఏమిటంటే పెళ్ళయి ఇన్ని సంవత్సరాలయినా మాకు పిల్లలు కలగకపోవడం. అందుకు నాకంటే ఆయనే ఎక్కువ బాధపడుతుండేవాడు. పట్నం వెళ్ళి ఇద్దరం డాక్టర్లుకు చూపించుకుని వాళ్ళు వాడమన్న మందులు వాళ్ళు చెప్పినంత కాలం వాడినా ఫలితం లేకపోయింది. నాటు మందుల జోలికి వెళ్ళలేదు. నాటు మందులంటే మా ఇద్దరికీ నమ్మకం లేదు. మా ఊరి పక్క ఊళ్ళోని అనాథాశ్రమం నుంచి ఎవరినయినా తెచ్చుకుని పెంచుకుందాం అని అనుకున్నాం గాని అదింకా కార్యరూపం కాలేదు. ఎప్పటికప్పుడు వెనకబడిపోతోంది.

మా ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగయింది. ఎడ్లబండి స్థానంలో ట్రాక్టరు వచ్చింది. ఆయన ట్రాక్టరు నడపడం నేర్చుకున్నాడు. మోటారు బైక్ కొనుక్కున్నాడు.

పాత ఇంటికి హంగులు దిద్ది పెంకుటింటిని మేడచేసి ఇంటికి అన్ని సదుపాయాలు పెట్టించి మేడమీద ప్రత్యేకంగా అందంగా గది కట్టించాడు. ఇంతవరకు మేడమీద గదిలో పడుకోలేదు. సంపాదనలో పడి ఆయన మునుపటంత శ్రద్ధ నామీద చూపించటం లేదేమో అని అప్పుడప్పుడు అనిపించేది.

పడక గది గురించి గుర్తుచేసినప్పుడల్లా నవ్వి గుర్తుంది అన్నట్టు తలూపేవాడు. గుర్తుచేసి ఆయనను ఇబ్బంది పెడుతున్నానా అనుకునేదాన్ని

తర్వాత కూరగాయలు అమ్మడానికి ఆయన బజారు వెళ్ళడం మానేశాడు. మా ఊరి దళారులేకాక చుట్టుపక్కల ఊళ్ళనుంచి దళారులు కూడా మా ఇంటికి వచ్చి సరుకు తీసుకువెళ్ళడం మొదలెట్టారు. ట్రాక్టరు అద్దెకు ఇవ్వడం మొదలెట్టాం. ఒకప్పుడు ఊళ్ళో కూలి చేసుకుని బతికినవాళ్ళం. ఇప్పుడు మెల్లగా ఊరి పెద్దల్లో జమ అయిపోయాం.

ఆరోజు రాత్రి పది దాటి ఉంటుంది. ప్రహరీగోడ తలుపు మూసి తాళం వేద్దామనుకునేంతలో ప్రహరీగోడ తలుపు ఎదురుగా జీపు వచ్చి ఆగింది. ఎవరయినా కూరగాయల కోసం వచ్చారేమో అనుకున్నాం. అంతవరకు కూరగాయలుండవు. సాయంత్రానికల్లా అయిపోతుంటాయి. బయటి దీపాలు వెలిగించాను. వీధి తలుపుకు ఆనుకున్నాను. ఆయన ప్రహరీ గోడ తలుపు దగ్గరగా ఉన్నాడు. వాళ్ళు కూరగాయలకు వచ్చినవాళ్ళలా అనిపించలేదు. దురుసు వ్యక్తుల్లా అనిపించారు. మాకు కాపలాదారులు లేరు. మా ఊరుకు దొంగల భయం లేదు. నా వెన్నులోంచి భయం మొదలయి వళ్ళంతా పాకడం మొదలెట్టింది.

"కూరగాయలేమీ లేవు..." అంటున్న ఆయన చేతుల్ని చెరొకరు పట్టుకుని ఇంట్లోకి తీసుకువచ్చి వీధి తలుపు వేసి గడియపెట్టి "బయటి లైట్లు ఆర్పేయి" అన్నాడు ఒకడు నన్ను చూస్తూ. వణుకుతున్న చేత్తో లైట్లు ఆర్పేశాను. కిటికీ తలుపులు మూసే ఉన్నాయి. నాతో మాట్లాడిన వాడికి ఇరవైరెండు సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండవు. రెండోవాడు మా ఆయనకన్నా పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. దొంగల్లా కనిపిస్తున్నారు. మా ఆయన ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషే గాని ధైర్యస్తుడేం కాదు. వాళ్ళిద్దరి చేతుల్లో కత్తులున్నాయి.

వాళ్ళల్లో కుర్రాడు నావంక తీక్షణంగా చూస్తూ "అరిచారంటే ఇద్దరినీ చంపేస్తాం" అతని మాట అరిచినట్టుగా ఉంది. భయం ఎక్కువవుతోంది. కాళ్ళు

భూమికి అతుక్కుపోయినట్టు ఉన్నచోటునుండి కదలలేకపోతున్నాను. ఏడుపు వస్తోంది. ఆపుకుంటున్నాను. ఇంట్లోని ఏ మాటా గోడ దాటదు. ఎక్కడ నుండి సహాయం వచ్చే మార్గంలేదు.

"ఇంట్లో ఇంకెవరున్నారు?" అడిగాడు రెండో అతను మా ఆయనను.

"ఇంకెవరూ లేరు. మేమిద్దరమే ఉంటున్నాం" అన్నాడాయన.

రెండో అతని కత్తి నా భర్త పక్కటెముకలకు ఆనించి ఉంచాడు. ఏమయినా చేయగలడు. నా భర్త ముఖం నిబ్బరంగా ఉంది. నాలా ఏమాత్రం భయాందోళలనలకు గురి కావడంలేదు. కుర్రాడు నాకు దూరంగానే ఉన్నాడు. తప్పించుకుని పక్క తలుపు తెరుచుకుని నేను పారిపోవచ్చు. నామీద కోపంతో నా భర్తను వాళ్ళు చంపేసినా చంపేస్తారు. అది నాకు ఇష్టం లేదు. ఆయనను వదులుకోను.

"మేం అన్నం తిని రెండు రోజులవుతోంది. ఆకలి బాగా వేస్తోంది. అన్నం ఉందా? కూరలేకపోయినా ఫరవాలేదు. పచ్చడి ఉంటే చాలు" నా వంక చూస్తూ అన్నాడు. మాటల్లో కరుకుదనం అలానే ఉంది. అతని మాటలకన్నా అతని చూపులే నాకు ఇబ్బందిగా ఉన్నాయి. పయిట భుజాలనిండా కప్పుకున్నాను. నాకంటే చిన్నవాడు.

"అన్నం ఉంది. బ్రెడ్ ఉంది. కూర కూడా ఉంది. ఫ్రిజ్‌లోంచి తీసి వేడిచేయాలి. అయిదు నిమిషాల్లో వేడిచేస్తాను..." అంటూంటే నా మాటలకు అడ్డు తగిలి, "వేడి చేయనవసరం లేదు. త్వరగా పెట్టేసేయి" చేతిలోని కత్తి ఆడిస్తూ అన్నాడు.

రెండో అతను తను తీసుకువచ్చిన తాడుతో నా భర్త చేతులూ, కాళ్ళు, మెడ కలిపి కట్టి అరవడానికి వీలులేకుండా నోట్లో రుమాలు పెట్టాడు.

చేతులు జోడించి, "మీకు దండం పెడతాను, దయచేసి ఆయనకేం అపకారం చేయకండి. ఆయన చాలా మంచివాడు..." అంటూ ఇద్దరికీ నమస్కారం చేస్తోంటే కుర్రాడు లాగి నా చెంపమీద కొట్టి, "ముందు అన్నం పెట్టవే" అరిచాడు. కళ్ళల్లో నీళ్ళు కారుతోంటే వాళ్ళకు భోజనం వడ్డించాను.

పది నిమిషాల్లో భోజనం చేయడం ముగించి కుర్చీ నా భర్త దగ్గరకు లాక్కుని ఏవేవో అడుగుతున్నాడు. అతను అడిగే వాటికి అవుననీ, కాదని తలాడిస్తున్నాడు.

ఇద్దరూ కాకలు తీరిన దొంగలో కాదో అర్థం కావటంలేదు.

కుర్రాడు భోజనం చేసాక పళ్ళెంలోనే చేయి కడుక్కుని నా చీర కొంగుతో చేయి, ముఖం తుడుచుకుని నన్ను తన పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోమని చెప్పి కూర్చున్నాక నా నడుం చుట్టూ చేయివేసి నిమురుతూ నన్ను గట్టిగా వత్తుతున్నాడు. కత్తి లైటు వెలుగులో తళతళలాడుతూ పళ్ళెంలో నా పక్కనే ఉంది. అతని స్పర్శ వేడిగా, గట్టిగా ఉంది. చటుక్కున కత్తి అందుకుని అతని కడుపులో నా శక్తి కొద్దీ పోటు పొడవవచ్చు. రెండో అతను నా భర్త ప్రాణం తీసేస్తాడు. ఏం చేయాలో అర్థం కావడంలేదు.

"నీ పేరు?"

చెప్పాను.

"నీ భర్తపేరు?"

చెప్పాను.

"ఇంట్లో డబ్బు ఎంతుంది. బంగారం ఎంతుంది?"

"ఇంట్లో మహా ఉంటే అయిదువేలుంటుంది. బంగారం మా ఊరి బేంకు లాకరులో ఉంది. ఇంట్లో ఉన్న డబ్బులు, నా ఒంటిమీదున్న బంగారం ఇస్తాను. పట్టుచీరలున్నాయి తీసుకెళ్ళండి..." అంటున్నాను. బల్లమీదున్న కత్తి చేతిలోకి తీసుకుని "మీ బీరువాలన్నీ చూపించు. లే... పద" అతను లేచాడు.

"నీ పేరు?"

"పోలీసు రిపోర్టులో రాయడానికా?"

"తెలుసుకోకూడదా?"

"చెప్పను."

వంటగదిలో మొదలుపెట్టి ప్రతి గదిలోని బీరువాలు ఒక్కటీ వదలకుండా లోపలి సామాన్లన్నీ కింద పడేసి ముందు కుర్రాడు, తర్వాత రెండో అతనూ వెదికారు. అయిదువేల చిల్లర, నా ఒంటిమీద బంగారం తీసి ఇచ్చాక అన్నీ ఒక తువ్వాలులో కట్టుకుని వీధి తలుపు దగ్గరకు వెళ్ళబోతూ కుర్రాడు ఆగి, "మేడ మీద గదిలో

ఎవరుంటున్నారు?" అడిగాడు.

మేడ గదికి లోపలి నుంచే మెట్లు ఉన్నాయి.

"అది చూసిరా" అన్నాడు రెండోఅతను.

నా భర్త కట్లు ఇంకా విప్పలేదు. కుర్రాడు నా చేయిపట్టుకుని "పద" అన్నాడు. మాటల్లో కరుకుదనం బాగా తగ్గింది. అతని చేతిలో కత్తి ఉన్నా అతనంటే భయం చాలామటుకు తగ్గింది. రెండోఅతను నా భర్త పక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

మేడ గది లైట్లు వెలిగించి అతను కప్‌బోర్డులు ఒక్కొక్కటి తెరిచి వెతుకుతోంటే చూస్తూ నిలబడ్డాను. చాలా కప్‌బోర్డులు ఖాళీగా ఉన్నాయి. వెతకడం అతనికి విసుగు పుట్టినట్టుంది. పంకా గాలి పెంచి మంచం మీద కూర్చుని చొక్కా గుండీలు విప్పుకుంటూ "తలుపు వేసి గడియ పెట్టిరా" అని చొక్కా తీసేసి మంచం మీద పడుకున్నాడు. తలుపు వేయడానికి నేను తాత్సర్యం చేస్తోంటే కత్తి తలుపుకు గురిచూసి విసిరాడు. తలుపుకు గుచ్చుకుపోయింది. గురి తప్పితే నాకు గుచ్చుకుపోయేది. గడియ పెట్టాను. మంచం దగ్గరకు వస్తోంటే పెద్దపులి బోనులోకి అడుగులు వేస్తున్నట్టనిపించింది. చేయి పట్టుకుని ముందుకు లాగాడు. అతని మీద పడ్డాను. నన్ను చుట్టేసుకుని చాలాసేపటి వరకు వదలలేదు.

వాళ్ళు వెళ్ళిపోయాక ఆయన కట్లు విప్పుతుంటే దుఃఖం ఆగలేదు. వలవల ఏడ్చేసాను. ఆయన నా తల నిమురుతూ నన్ను ఓదార్చి మేడమీద గదిలో ఏం జరిగిందని నన్ను అడగలేదు. నా అంతట నేను ఎలా చెప్పాలో తెలియలేదు. తాళ్ళు కట్టిన చోట తడుముతూ ఉంటే అడిగాడు, "అతని పేరేమిటి?"

"వాసు" అన్నాను.

తొమ్మిది నెలల తర్వాత నాకు బాబు పుట్టాడు. వాడికి నా భర్తే 'వాసు' అని పేరు పెట్టాడు.

వాడికి ఇప్పుడు ఇరవై రెండో సంవత్సరం నడుస్తోంది. చదువు అంతగా అబ్బలేదు. వ్యాపార దక్షత బాగా అలవడింది. అన్ని విషయాల్లోనూ ఆయనకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వాసు అంటే ఆయనకు చాలా ఇష్టం. మేడమీద గది వాడు సొంతం చేసుకున్నాడు. ఆ మంచం మీదే ఎక్కువసేపు నిద్రపోతుంటాడు.

రాత్రి భోజనం చేశాక కొత్తగా కొన్న సుమోలో బయల్దేరతాడు. ఎక్కడికి వెళ్తున్నాడో నేనడిగినా, ఆయనడిగినా చెప్పడు. 'ఇప్పుడే వచ్చేస్తానులే' అంటాడు గాని ఇంటికి తిరిగి వచ్చేసరికి ఒంటిగంట దాటుతుంటుంది.

నా భయమల్లా ఒక్కటే. సుమోలో వెళ్ళేప్పుడు తళతళలాడే పదునయిన కత్తిని తనతో తీసుకువెళ్తుంటాడు.

*ఆదివారం 'ఆంధ్రప్రభ', 8 జూన్, 2014*